క్లుప్తంగా

వరద బాధితులకు పులి హోర ప్యాకెట్స్ పంపిణీ



పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం నుంచి వరద బాధిత ప్రాంతాలకు పులిహోర ప్యాకెట్లు వాహనంలో తరలించినట్లు ఆలయ ఉప కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. పెదకాకాని శివాలయం నుంచి మంగళవారం విజయవాడ వరద బాధితులకు దేవదాయ ధర్మదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనరు ఎస్.సత్యనారాయణ ఆదేశాల మేరకు ఐదు వేల పులిహోర ప్యాకెట్లను పంపించామన్నారు. గుంటూరు జిల్లా కలెక్టరు సూచన మేరకు విజయవాడ మున్సిపల్ స్టేడియంలో కేటాయించిన 5వ వార్డు గుణదల, క్రీస్తురాజపురం వరద ప్రభావిత ప్రాంతాలకు ప్రత్యేక వాహనం ద్వారా బాధితులకు పులిహోర ప్యాకెట్స్ అందజేసినట్లు తెలిపారు.

విజ్ఞాన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ

చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పమిడి లక్ష్మీనారాయణకు పీహెచ్‌డీ పట్టా అందజేసిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. లక్ష్మీనారాయణ 'ఫేసర్ మెజర్‌మెంట్ యూనిట్ ప్లేస్‌మెంట్ విత్ కంప్లీట్ అబ్జర్వబిలిటీ ఫర్ డైనమిక్ స్టేట్ ఎస్టిమేషన్ ఇన్ పవర్ సిస్టమ్' అనే అంశంపై పరిశోధన చేశారని తెలిపారు. ఈయన తన పరిశోధనలో భాగంగా మొత్తం ఎస్‌సీఐ-1, స్కోపస్ జర్నల్స్-3, ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లు 2 ప్రచురించారని వెల్లడించారు. పీహెచ్‌డీ పట్టాపొందిన పమిడి లక్ష్మీనారాయణను పలువురు అభినందించారు.

కొనరు.. కొట్టేస్తారు

బెంగళూరులో మహిళా దొంగల ముఠా అరెస్టు

బనశంకరి: దుకాణదారుల దృష్టి మళ్లించి లక్షలాది రూపాయలు విలువ చేసే పట్టుచీరలు దోపిడీకి పాల్పడే మహిళా ముఠాని మంగళవారం బెంగళూరు జేపీ నగర పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.17.50 లక్షల విలువ చేసే 38 పట్టు చీరలను స్వాధీనం చేసుకున్నామని నగర పోలీస్ కమిషనర్ బి.దయానంద్ తెలిపారు. మంగళవారం కేసు వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా జిల్లా మైలవరం నివాసి పొన్నూరు మల్లి, చెవుటూరువాసి సాదు పట్టి, కొండపల్లివాసి మేద రజని, గుంటూరు జిల్లా ఉండవల్లివాసి మదుగాని జానకి ముఠాగా ఏర్పడి చీరల చోరీకి తెరతీశారు. జేపీ నగర పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిల్క్‌హౌస్‌లోకి చీరలు కొనాలని వెళ్లారు. అక్కడి సిబ్బంది వారికి పలురకాల పట్టుచీరలు చూపించారు. ఈ సమయంలో వారిలో కొందరు సిబ్బంది దృష్టి మళ్లించి చీరలను దుస్తుల్లో దాచుకునేవారు. ఇలా విలువైన 8 పట్టుచీరలను దొంగిలించారు. ఇటీవల మరోసారి అదే షాపులో 10 పట్టుచీరలను దుస్తుల్లో దాచుకుని వెళ్లిపోతుండగా షాపు యజమాని అడ్డుకుని పరిశీలించగా 10 పట్టుచీరలు బయటపడ్డాయి. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి చీరలను, మహిళలను పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. ముఠాలో మరో ఇద్దరు మహిళలు ఉన్నారని నిందితులు తెలిపారు. చోరీకి పాల్పడిన పట్టుచీరలను కోరమంగలలో నివాసం ఉండే స్నేహితునికి ఇచ్చినట్లు తెలిపారు. అక్కడ సోదాలు చేసి 28 పట్టుచీరలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు, వాటి విలువ రూ.17 లక్షలపైనే ఉంటుందని పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న ఇద్దరు మహిళల కోసం గాలింపు చేపట్టారు. విలేకరుల సమావేశంలో డీసీపీ లోకేశ్ భరమప్ప, ఏసీపీ నారాయణస్వామి, సీఐ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి ఉపన్యాసంపై శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: డిగ్రీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 14, 15 తేదీలలో ఉచిత ఉపన్యాస శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు స్టెప్ నల్లపాడు సమన్వయకర్తలు ఆరుదల సాంబశివరావు, వెంకట్‌రెడ్డి, వీవీ రావ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తరగతులలో పాల్గొనే విద్యార్థులకు ఉచిత వసతి, భోజన వసతి కల్పించినట్లు చెప్పారు. పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందించనున్నట్లు పేర్కొన్నారు. తరగతులు గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నెక్కల్లులోని ధ్యాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు 9030644440, 8143234555 సంప్రదించాలని కోరారు.

నిండా నిర్లక్ష్యం.. నెరవేరని లక్ష్యం

- తాత్కాలిక చర్యలతో సమయం వృథా
- ఇళ్లలో చేరిన నీటి తొలగింపులో తీవ్ర జాప్యం
- మూడు రోజులుగా డీవీసీ కాలనీ వాసుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



డీవీసీ కాలనీలో ఇంటిని చుట్టుముట్టిన వరద నీరు

పొన్నూరు: పట్టణంలోని డీవీసీ కాలనీలో ఇళ్లలోకి చేరిన నీటితో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు రోజులుగా సమస్యను ఎదుర్కొంటున్నా, యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారు. వీధులతో పాటు ఇళ్లలోకి చేరిన నీటిని తొలగించడంలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కాలనీ వాసులను మభ్యపెట్టేందుకు తాత్కాలిక చర్యలతో కాలం వెళ్లదీస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీ వర్షాల కారణంగా కాలనీ సమీపంలోని తుంగభద్ర కాలువ పొంగడంతో కాలనీలోని ఆరు వీధుల్లోకి మోకాలు లోతు నీరు చేరింది. ఇళ్లన్నీ నీట మునిగాయి. దీంతో స్థానిక ప్రజలు ఎటు వెళ్లాలో తెలియని స్థితిలో నీటిలోనే జీవనం సాగిస్తున్నారు. నీటిలోనే కార్యకలాపాలు కొనసాగిస్తూ అవస్థలు పడుతున్నారు. వరద ప్రభావంతో ప్రతిసారి డీవీసీ కాలనీకి ముంపు సమస్య ఉన్నప్పటికీ శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ముంపు బెడద ఎల్లప్పుడూ స్థానికులను వెంటాడుతోందని ప్రజలు వాపోతున్నారు. కాలనీలోని ప్రధాన డ్రెయిన్‌కు అనుసంధానంగా ఉన్న తుంగభద్ర కాలువ తూము నిర్వహణ సక్రమంగా లేకపోవడమే ఇళ్లలోకి నీరు చేరడానికి ప్రధాన కారణమని సాక్షిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు సమస్య పరిష్కారం దిశగా చర్యలు చేపట్టారు. వరద నీరు విడుదల అవుతున్న తూముకు ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేశారు. వీధుల్లో, ఇళ్లలోకి చేరిన నీటిని తొలగించేందుకు నీటి మోటారును ఏర్పాటు చేశారు. అయితే అధికారుల చర్యలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాత్కాలిక చర్యలతో వరద ప్రవాహాన్ని ఆపడం సాధ్యమేనా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. వీధుల్లోకి చేరిన మోకాలు లోతు నీటి తొలగింపు కాలం చెల్లిన మోటారుతో సాధ్యమయ్యే పని కాదని స్థానికులు చెబుతున్నారు. వర్షాలు కురవకముందే తూముకు అడ్డుకట్ట వేస్తే ఇంత సమస్య ఉండేది కాదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఇళ్లలోకి చేరిన నీరు



చిన్న మోటారుతో నీటిని తొలగిస్తున్న దృశ్యం

15 ఏళ్ల నుంచి ఇవే ఇబ్బందులు



డీవీసీ కాలనీ ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తయింది. డ్రెయిన్ ఏర్పాటులో జరిగిన నిర్లక్ష్యంతోనే వరదల సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. 15 సంవత్సరాల క్రితం వరద కారణంగా ఇవే ఇబ్బందులు ఎదుర్కొన్నాం. మళ్లీ అదే సమస్య ఏర్పడింది. తుంగభద్ర కాలువకు, ప్రధాన డ్రెయిన్ అనుసంధానంగా ఉండటంతో వరద సమయంలో కాలువ నీరు ఇళ్లలోకి చేరుతోంది. డ్రెయిన్‌కు అడ్డుకట్ట వేసి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలి.

–అంకయ్య, డీవీసీ కాలనీ, పొన్నూరు

వరద నీటిలోనే జీవనం



వరదల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తుంగభద్ర కాలువ పొంగితే నిద్రాహారాలు మానాల్సిన పరిస్థితి నెలకొంది. ఇళ్లలోకి నీరు చేరినా ఆ నీటిలోనే జీవనం సాగిస్తున్నాం. అధికారులు తాత్కాలిక చర్యలు చేపడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచన చేయడం లేదు. తూముకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయాలని కోరుతున్నా.

– సత్యనారాయణ, డీవీసీ కాలనీ, పొన్నూరు

నీట మునిగిన వరిని పరిశీలిస్తున్న అధికారులు



వరిని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఢిల్లీరావు తదితరులు

పెదకాకాని: పొలాల్లో నీరు పూర్తిగా బయటకు పంపి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించిన తరువాత నష్టపరిహారం అంచనా వేయాలని రాష్ట్ర వ్యవసాయ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఢిల్లీరావు అన్నారు. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, నంబూరు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. నీట మునిగిన వరి పొలాలనురాష్ట్ర వ్యవసాయ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఢిల్లీరావు, జిల్లా వ్యవసాయ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ పొలాల్లో పూర్తిగా నీరు బయటకు పోయిన తరువాత వ్యవసాయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పొలాలను సందర్శించి పంట నష్టం నివేదిక అందజేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, సంయుక్త సంచాలకుడు ఎం.సునీల్‌కుమార్, ఏఓ పి.సంధ్యారాణి, గ్రామ సర్పంచులు కర్నాటి శ్రీనివాసరావు, ధూళిపాళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చేబ్రోలు: వరద ముంపు బారిన పడిన పొలాల్లోని నీటిని బయటకు పంపి దెబ్బతినకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని లాం ఫాం ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.ప్రతిభ శ్రీ అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో వరదు ముంపునకు గురైన వరి పంట పొలాలను గుంటూరు లాం ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్ ప్రతిభ శ్రీ, గుంటూరు డాట్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్, డాక్టర్ కిషోర్ వర్మ(పెథాలజీ సైంటిస్ట్), పొన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రామకోటేశ్వరి, మండల వ్యవసాయశాఖాధికారి బి.శ్రీనివాసనాయక్ తదితరులు వరి పొలాలను పరిశీలించారు. ముందుగా ముంపునకు గురి అయిన వరి పొలంలోని నీటిని తీసివేసి ఎకరాకు 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ కలిపి చల్లుకోవాలన్నారు. పైపాటుగా మల్టీకేసు వారం రోజుల వ్యవధిలో రెండుసార్లుగా పిచికారి చేయాలన్నారు. అలాగే చౌడు పొలాలలో జింక్ సల్ఫేట్‌ను ఎకరాకు 400 గ్రాముల చొప్పున పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ కె.సునీత, వీఏఏలు ప్రవీణ్, పి.భానురేఖ పాల్గొన్నారు.

బాధితులకు సకాలంలో అందని ఆహారం



పెదకాకాని లూథర్‌గిరికాలనీలో ఆహారం కోసం వేచిఉన్న చిన్నారులు

పెదకాకాని: వరద బాధితులకు సకాలంలో ఆహారం చేరడం లేదు. తుఫాన్ ప్రభావంతో పెదకాకాని పల్లాలమ్మ చెరువుకు అధిక పరిమాణంలో వరదనీరు వచ్చి చేరింది. దీని ప్రభావంతో సుందరయ్యకాలనీకి చెందిన సుమారు వంద కుటుంబాల వారికి గ్రామంలోని అపరకర్మల సత్రంలోనూ, మండల పరిషత్ కార్యాలయంలోనూ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలానే బాజీబాబా దర్గా సమీపంలో ఇళ్లు నీటమునగడంతో 150 కుటుంబాల వారిని పెదకాకాని లూథర్‌గిరికాలనీ ప్రాథమిక పాఠశాలకు తరలించారు. తుఫాన్ బాధితులు సకాలంలో ఆహారం అందడం లేదని బాధితులు వాపోతున్నారు. భోజనం అందించడం ఆలస్యం కావడంతో దీర్ఘకాలిక రోగులు, చిన్నారులు, వృద్ధులు, బాలింతలు ఆకలితో అలమటిస్తున్నారు. ముఖ్యంగా పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఏర్పాటు చేయాల్సిన ఆహార పదార్థాలు అధికారులు సమకూర్చాల్సి ఉండగా ఎప్పటికప్పుడు భోజనం ఏర్పాటు చేసేందుకు దాతలను వెతుకుతున్నారు. దీంతో ఒక ప్రాంతంలో భోజనం పెడితే మరొక ప్రాంతానికి భోజనం పెట్టేందుకు మరికొంతమంది దాతలను వెతికే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. సోమవారం రాత్రి కొందరికి భోజనం అందకపోవడంతో మంచినీళ్లు తాగి పస్తు పడుకోవాల్సి వచ్చింది. భోజనం పెట్టే సమయానికి వచ్చి పలువురు సిబ్బంది ఫోటోలు దిగి వెళుతున్నారు. సకాలంలో ఆహారం పెట్టి ఆదుకోవాలని తుఫాన్ బాధితులు కోరుతున్నారు.

మంచినీళ్లు తాగి పడుకున్నా

భోజనం అందకపోవడంతో మంచినీళ్లు తాగి పస్తు పడుకున్నా. పునరావాస కేంద్రంలో పట్టించుకోవడం లేదు. సకాలంలో భోజనం రాకపోవడంతో పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు ఆకలితో బాధపడుతున్నారు. భోజనం చేసేందుకు కూడా డబ్బులు లేవు....

– స్వరూప, వరద బాధితురాలు, పెదకాకాని

పంట పొలాలను వదలని వరద

ముంపు బారిన వరి, కూరగాయతోటలు



శలపాడు- వీరనాయకునిపాలెం గ్రామాల మధ్య నీట మునిగిన వరి పొలాలు

చేబ్రోలు: నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు చేబ్రోలు మండలంలోని పంట పొలాలు వరద బారి నుంచి మంగళవారం కూడా బయటపడలేదు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా నీరు ప్రవహిస్తుండటంతో దిగువ ప్రాంతాలకు వెళ్లటానికి సమస్యగా మారింది. చేబ్రోలు మండలంలోని వీరనాయకునిపాలెం, శేకూరు, శలపాడు, వేజండ్ల, సుద్దపల్లి, నారాకోడూరు గ్రామాల పరిధిలో వరద ఉధృతి కొనసాగుతోంది. వీరనాయకునిపాలెం గ్రామ పరిధిలోని పంట పొలాలు మునిగిపోయాయి. మంగళగిరి, గుంటూరు ప్రాంతాల నుంచి వరద ఉధృతి తగ్గకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎగువ నుంచి వచ్చే ప్రవాహం తగ్గు ముఖం పడితే తమ పొలాల్లోని నీరు కిందకు వెళ్తుందని చెబుతున్నారు. వీరనాయకునిపాలెం, శలపాడు గ్రామాల్లోని వరి పొలాలు మొక్కలు చివరిభాగం కూడా కనబడటం లేదు. వరద నీరు బయటకు వెళ్లాలంటే మరికొన్ని రోజులు పడుతుందని అప్పటికీ పైరు పూర్తిగా కుళ్లిపోయి చచ్చిపోతుందని అంటున్నారు. ఇప్పటికే వేలాదిరూపాయిలు పెట్టుబడి పెట్టి సాగు చేపట్టిన మాకు ప్రస్తుత పరిస్థితి తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. శలపాడు గ్రామ పరిధిలో సొరతోట పందిరి, పొట్లతోట పందరి నేల కూలాయి. నారాకోడూరు, గుండవరం గ్రామాల్లో దొండ పందిళ్లు కూలిపోయాయి. లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన పందిరి తోటలు పడిపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం నష్టపోయి, దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని రైతాంగం కోరుతున్నారు. వీరనాయకునిపాలెం, శేకూరు గ్రామాల పరిధిలో మెట్ట పంటలైన పత్తి సాగులో వరద నీరు నిల్వ ఉండటంతో మొక్కలు ఉరకెత్తి చచ్చిపోతాయే అవకాశం ఉందని చెబుతున్నారు. నారాకోడూరు, గొడవర్రు గ్రామాల పరిధిలో వరి పొలాల్లోని నీరు కిందకు కదలని పరిస్థితి నెలకొని ఉంది. మంచాల, చేబ్రోలు, వడ్లమూడి గ్రామాల పరధిలోని పొలాల్లో వరద ఉధృతి కొంత తగ్గుముఖం పట్టింది.



శలపాడు గ్రామంలో వర్షాలకు కూలిపోయిన సొర పందిళ్లు



శేకూరు గ్రామ పరిధిలో పత్తి పొలంలో నిలిచిన వర్షపునీరు

పంట రక్షణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న ఉద్యానశాఖ స్టేట్ డైరెక్టర్ కె.శ్రీనివాసులు

చేబ్రోలు: భారీ వర్షాలకు కూరగాయ పంటలో నీరు నిలిచి ఉరకెత్తిన పొలాల్లోని రైతులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఉద్యాన శాఖ స్టేట్ డైరెక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలో మంగళవారం వానలకు దెబ్బతిన్న తోటలను ఆయన పరిశీలించారు. వెంట జిల్లా ఉద్యాన శాఖాధికారి బి. రవీంద్రబాబు, ఏపీఎంఐడీ ఎల్.వజ్రశ్రీ,, లాం సైంటిస్ట్ సీవీ రమణ, పొన్నూరు ఉద్యాన శాఖాధికారిణి పి.ఉష తదితరులు ఉన్నారు. పంట పరిశీలించి రైతులకు తగిన సూచనలు, సలహాలను అందజేశారు. శాస్త్రవేత్త సీవీ రమణ మాట్లాడుతూ.. ఉరకెత్తిన పొలాల్లో సూల పోషకాల మిశ్రమం 19.19.19, మెగ్నీషియం సల్ఫేట్‌లను ఒకదాని తరువాత ఒకటి వారం వ్యవధిలో రెండు మూడు సార్లు పిచికారి చేయాలన్నారు. పంటకు ఆకుపచ్చ, కాయకుళ్లు బూజు తెగులు అధికంగా ఉంటుందని చెప్పారు. ముందు జాగ్రత్త చర్యగా లీటరు నీటికి రెండున్నర గ్రాములు మాంకోజెబ్, కార్బిండిజమ్ మందును కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. వేరుకుళ్లు ఆశించకుండా పొలాల్లో పది లీటర్ల నీటిలో కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రాములు లేదా కార్బిన్‌డిజమ్ పది గ్రాములు కలిపిన ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో పోయాలని సూచించారు. దొండ, చిక్కుడు, బీర, కాకర, వంగ తదితర కూరగాయ తోటల ప్రస్తుత పరిస్థితిని అధికారులకు రైతులు వివరించారు.

చవితి వేడుకల్లో నిబంధనలు తప్పనిసరి



పెదకాకానిలో చవితి నిర్వహణపై కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ నారాయణస్వామి

పెదకాకాని: వినాయక చవితి వేడుకల నిర్వహణలో కమిటీ సభ్యులు నిబంధనలు పాటించాలని పెదకాకాని సీఐ టి.నారాయణస్వామి అన్నారు. పెదకాకాని పోలీసుస్టేషన్ ఆవరణలో మంగళవారం మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పందిళ్లలో వినాయక చవితి నిర్వహించనున్న కమిటీ సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా గణేష్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన సభ్యులు కమిటీగా ఏర్పడి పోలీసుస్టేషన్‌లో వివరాలు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ స్థలాలలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనుకుంటే సంబంధిత స్థల యజమాని, సంబంధిత విభాగం అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. ఫైర్, విద్యుత్ శాఖల అనుమతితో పాటు అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గణేష్ ప్రతిమల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం, విగ్రహ నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను విధిగా తెలియజేయాలని కోరారు. ఊరేగింపు సమయంలో పోలీస్ వారి అనుమతి లేకుండా వేషధారణలు, ఎక్కువ శబ్దం వచ్చే వాయిద్యాలు, డీజే తదితరాలకు అనుమతి లేదన్నారు. పండుగ రోజు నుంచి నిమజ్జనం వరకు జరిగే పూజలు, వేడుకల సందర్భాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా ప్రజలందరూ వినాయక చవితి పండుగను జరుపుకోవాలని సూచించారు.

వరద నీటిలో కొట్టుకొచ్చిన రెండు మృతదేహాలు



నంబూరు వద్ద గుంటూరు చానల్‌లో మృతదేహం..



గుంటూరు శివారు శివనాగరాజు కాలనీ వాగులో మృతదేహం..

పెదకాకాని: వరద ఉధృతికి ప్రాణాలు కోల్పోయిన ఇద్దరి మృతదేహాలు వెలుగు చూశాయి. పోలీసుల కథనం ప్రకారం.. పెదకాకాని మండల పరిధిలోని గుంటూరుకు శివారు ప్రాంతమైన శివనాగరాజుకాలనీ పక్కనే ప్రవహిస్తున్న వాగులో మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. నంబూరు సమీపంలో గుంటూరు చానల్‌లో కూడా మరొకటి తేలి ఉన్నట్లు సమాచారం అందింది. పోలీసులు వాటిని బయటకు తీయించారు. ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ టి. నారాయణస్వామి తెలిపారు. మృతదేహాలను గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

కూరగాయల టెండర్లలోనూ కక్కుర్తి..

- టెండరు గడువు ముగించిన అధికార పార్టీ వ్యక్తికి అనుమతి
- వివాదంతో టెండర్లు రద్దు చేసినట్లు ప్రకటన

పెదకాకాని: శివాలయంలో అన్నసంతర్పణ కోసం నిర్వహించే టెండర్లలోనూ కక్కుర్తి రాజకీయం తెరలేపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆరు నెలల పాటు కూరగాయలు అందించేందుకు సోమవారం టెండర్లు నిర్వహించాల్సి ఉంది. ఆలయానికి సంబంధించిన ఏ టెండర్ ప్రకటన ఇవ్వాల్సి వచ్చినా ఒక ప్రధాన పత్రికకు ఇవ్వాల్సి ఉంది. వాస్తవానికి టెంటర్లలో పాల్గొనే వారు ఒకరోజు ముందుగానే టెండరు ఫారాలు తీసుకుని పూర్తి చేసి ఆలయంలో అందజేశారు. అధికారులు చెప్పిన విధంగా టెండర్ ద్వారా కూరగాయలు పాడుకునేందుకు ముగ్గురు టెండర్‌దారులు పోటీలో ఉన్నారు. అప్పటి వరకూ ఆ పార్టీ నాయకుడికి కూరగాయల సరఫరాపై అవగాహన లేదు. అప్పటికప్పుడు తెలుసుకుని ఆలయానికి చేరుకోవడం, టెండర్ ఫాం తీసుకోవడం, ఆలయ అధికారులు ఆ ఫాంపై ఒకరోజు ముందు తారీఖు వేసి ఇవ్వడం, ఆయన పూర్తి చేసిన టెండర్ ఫాంను పూర్తి చేసి అధికారులకు ఇవ్వడం చకచకా సాగిపోయింది. దీంతో అప్పటికే టెండర్ పాటలో ఉన్న ముగ్గురు వాదనకు దిగడం, హిందూ పరిషత్ వారికి సమాచారం ఇవ్వడంతో పాటను రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. రూ.5 వేలు ఖర్చు చేసి ప్రకటన ఇవ్వడం, ఆ ప్రకటన కూడా నిబంధనలకు విరుద్ధంగా ఇవ్వడం, అందులో తేదీ ప్రకటించకపోవడం, టెండర్ వేసిన వారిని పక్కన పెట్టి పాట రోజునే టెండర్ ఫాం అమ్మడం, ఒక రోజు ముందు తేదీ ఆ ఫాంపై వేయడం వివాదంగా మారింది. దేవదాయ ధర్మాదాయశాఖ నిబంధనలకు తిలోదకాలిస్తూ ఆలయ అధికారులు వ్యవహరిస్తున్న తీరు గొడవలకు దారి తీస్తుంది. ఇప్పటికైనా దేవాదాయశాఖ అధికారులు స్పందించి వేలంపాటల్లో నిబంధనలకు తూట్లు పొడుస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని టెండర్‌దారులు, భక్తులు, ప్రజలు కోరుతున్నారు.

విలువల జోడింపుతోనే రైతుకు ఆదాయం

గుంటూరు రూరల్: రైతులు పండించిన పంటలకు విలువల జోడింపుతోనే రైతులు మంచి ఆదాయం పొందగలరని రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో రైతునేస్తం ఫౌండేషన్‌లో రైతులకు సేంద్రియ వ్యవసాయం, సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు శ్రమించి పంటలు పండించి, దిగుబడులు సాధించి, ఆ దిగుబడులను మార్కెట్లో విక్రయిస్తున్నారన్నారు. వివిధ రకాల కారణాల వల్ల రైతుల శ్రమకు తగ్గ ఫలితం అందడం లేదన్నారు. కార్యక్రమంలో సేంద్రియ రైతులు శబరీనాథ్, మీసాల రామకృష్ణ మాట్లాడారు. హాజరైన రైతులకు ఒక జామ మొక్కతో పాటు వినాయక మట్టి విగ్రహాన్ని అందజేశారు. శిక్షణకు హాజరైన రైతులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.